ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 30.09.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.

2. జపాన్ లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో స్వర్ణపతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారిణి చికితారావుకు రాష్ట్ర క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి అభినందనలు తెలియజేశారు.

3. రాష్ట్రంలో పలు చోట్ల పంటలు ఎండిపోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, అన్నదాతలను కాంగ్రెస్ తీవ్రంగా మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆరోపించారు.

4. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం కుందన్‌పల్లిలోని చాముండిపట్నం కాలనీలో ఆక్రమణకు గురైన 7వేల 200 గజాల ప్రజావసరాల స్థలాలను హైడ్రా కాపాడింది.

------------------------

రేవంత్ కరీంనగర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ను ప్రారంభించి, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. మరిన్ని వివరాలు మా ప్రతినిధి సంపత్ కుమార్ అందిస్తారు.

**వాయిస్ కాస్ట్**

**పీటీసీ - కరీంనగర్**

------------------------

సిరిసిల్ల రేవంత్

కరీంనగర్ పర్యటన ముగిసిన తర్వాత సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్లకు చేరుకొని 350 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. పూర్తి వివరాలు మా ప్రతినిధి లక్ష్మినారాయణ అందిస్తారు.

**వాయిస్ కాస్ట్**

**పీటీసీ - సిరిసిల్ల**

----------------------

**వాకిటి**

జపాన్ లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో ఆర్చరీ కాంపౌండ్ టీం ఈవెంట్, ఆర్చరీ మిక్స్ డ్ ఈవెంట్లో స్వర్ణ పతకాలు సాధించిన తెలంగాణ క్రీడా ఆణిముత్యం చికితారావుకు రాష్ట్ర క్రీడ యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందనలు తెలిపారు. చికిత తండ్రి శ్రీనివాస్ రావుతో ఫోన్లో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. స్వర్ణ పతకాలు సాధించి 2028 లాస్ ఎంజిల్స్ లో జరిగే ఒలంపిక్స్ కు అర్హత సాధించిన చికితారావు, తెలంగాణ క్రీడాకారులు అందరికీ గర్వంగా ఆదర్శంగా నిలబడాలని మంత్రి ఆకాంక్షించారు.

**డెస్క్**

------------------------------

**బీజేపీ రామచందర్ రావు**

పంటలు ఎండిపోవడానికి కారణమై, కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను తీవ్రంగా మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మండిపడ్డారు. బీజేపీ ప్రతినిధి బృందంతో కలిసి నల్గొండ జిల్లాలో పర్యటించిన ఆయన, రైతులను నేరుగా కలిసి సమస్యలు తెలుసుకోవడమే పర్యటన ఉద్దేశమన్నారు. నల్గొండలో జరిగిన 'సేవా సంకల్ప్ అభియాన్'

కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తిచేసుకున్న సందర్భంగా దీన్ని చేపట్టినట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్న ఆయన, సేవ, స్వచ్ఛత ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు. మోదీ స్ఫూర్తితో కార్యకర్తలు సమాజ, దేశ సేవకు అంకితభావంతో పనిచేయాలని కోరారు.

**డెస్క్**

---------------------------

**ప్రమాదం**

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రమాదం తప్పింది. సాంకేతిక లోపం తలెత్తడంతో ఎయిర్‌లైన్స్ విమానం అత్యవసర ల్యాండింగ్ అయింది. శంషాబాద్ నుండి విజయవాడ బయలుదేరిన 591 ఎయిర్‌లైన్స్ విమానంలో... టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ సాంకేతిక లోపాన్ని గుర్తించారు. వెంటనే అప్రమత్తమై ఏటీసీకి సమాచారం అందించారు. దీంతో అధికారులు అప్రమత్తమై, విమానాన్ని తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా కిందకు దించారు. విమానం సేఫ్‌గా ల్యాండ్ కావడంతో ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

**పీటీసీ – హైదరాబాద్**

----------------------------

**హైడ్రా**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం కుందన్‌పల్లిలోని చాముండిపట్నం కాలనీలో ఆక్రమణకు గురైన 7వేల 200 గజాల ప్రజావసరాల స్థలాలను హైడ్రా కాపాడింది. కాలనీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా, మంగళవారం ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసింది. మరోవైపు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని 100 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న సాకి చెరువులో మట్టి పోసి కబ్జా చేయకుండా, ఇరిగేషన్ అధికారుల విజ్ఞప్తి మేరకు కిలోమీటరు మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

**డెస్క్**

-----------------------------------

**సుభాష్**

సిరిసిల్లలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు హాజరుకాకపోతే జరిమానా విధిస్తామని మహిళా సంఘాలను బెదిరించడం కాంగ్రెస్ నిరంకుశత్వానికి పరాకాష్ట అని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌ఛార్జ్ ఎన్.వి. సుభాష్ విమర్శించారు. స్వచ్ఛందంగా జనం రారని తెలిసి, సభలో పరువు పోతుందనే భయంతోనే వీవోఏల ద్వారా హుకుం జారీ చేయించారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందా, లేక నిజాం రజాకార్ల ఫత్వా పాలన సాగుతోందా అని ప్రశ్నించారు.

**డెస్క్**

--------------------------------

**అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 27వ స్నాతకోత్సవం అక్టోబర్ 7న జూబ్లీహిల్స్ క్యాంపస్‌లోని ఆడిటోరియంలో జరగనుందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. ఈరోజు బేగంపేట్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ గవర్నర్  విశ్వవిద్యాలయ ఛాన్సలర్  శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై పట్టాలు, గోల్డ్ మెడల్స్ ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఈ ఏడాది మొత్తం 36,145 మంది అభ్యర్థులు డిగ్రీలు, సర్టిఫికెట్లు అందుకోనున్నారని, ప్రఖ్యాత నిర్మాత  బి. నర్సింగ్ రావుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు వివరించారు.

**పీటీసీ - హైదరాబాద్**

--------------------------------

**టూర్**

జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేతృత్వంలోని అసెంబ్లీ ప్రతినిధి బృందం పర్యటిస్తోంది. అక్కడి

భారత కాన్సులేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడిన స్పీకర్, తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని చెప్పారు. యూరప్ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలోని అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రవాస తెలుగువారు పెట్టుబడులు, సాంకేతికత, నైపుణ్యాలను తీసుకురావడంలో వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ బృందం ఆస్ట్రియా, స్విట్జర్లాండ్‌లలో కూడా పర్యటించి, వచ్చే నెల 9న హైదరాబాద్ చేరుకుంటుంది.

**డెస్క్**

----------------------------------

**హరీష్ బాబు**

రాష్ట్రంలో వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆరోపించారు. నియోజకవర్గంలోని కౌటాల మండలంలో పలు సబ్ స్టేషన్లను సందర్శించి లాగ్ బుక్కులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

**బైట్ హరీష్ బాబు**

**పీటీసీ – ఆసిఫాబాదాద్**

----------------------------------

**ఎమ్మెల్సీ**

ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గంలో ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ను విడుదల చేసినట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి .చంద్రశేఖర్ తెలిపారు.

**పీటీసీ - నల్గొండ**

-------------------------------------

**అంతర్జాతీయ అనువాద దినోత్సవం**

ఈరోజు అంతర్జాతీయ అనువాద దినోత్సవం జరుపుకుంటున్నారు. అనువాదకులు, వ్యాఖ్యాతలు, భాషా నిపుణుల సేవలను గుర్తించి గౌరవించడం, దేశాలు, సంస్కృతుల మధ్య వారధిగా అనువాదం పోషించే పాత్రను చాటడం ఈ దినోత్సవ ఉద్దేశం. 2017లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం దీనిని అధికారికంగా ప్రకటించింది. "భాషా వైవిధ్యం – భాషా హక్కులు"; "అర్థం చేసుకోబడటంలోని శక్తి" అనేది ఈ ఏడాది ఇతివృత్తంగా ఉంది.

**జీఎస్**

-------------------------------

**పథకాలు**

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. లో రెవెన్యూ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్ఐఆర్, రీ-సర్వే, సాదాబైనామా, 22-ఎ, భూభారతి, రెవెన్యూ సదస్సులు, ప్రజావాణి, కళ్యాణలక్ష్మి-షాదీముబారక్, కోర్టు కేసులు, ఇసుక, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు.

**పీటీసీ - మంచిర్యాల**

--------------------------------

**శిక్షణ**

సూర్యాపేట జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల కోసం 45 రోజుల ప్రత్యేక ప్రిలిమ్స్ క్రాష్ కోర్సు, ఉచిత శారీరక సామర్థ్య శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

**పీటీసీ - సూర్యాపేట**

---------------------------------

**ఎమ్మెల్సీ**

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అర్హులైన పట్టభద్రులంతా తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు.

**పీటీసీ - భద్రాద్రి**

---------------------

**కలెక్టర్**

హనుమకొండ జిల్లాలో వివిధ దశల్లో ఉన్న విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. డీఆర్డీఏ, సెర్ప్, స్త్రీనిధి అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు సూచించారు.

**పీటీసీ - వరంగల్**

---------------------------------